# — బంగారు కాలం —

గోపాల చక్రవర్తి

సంవత్సరం 2030 క్రీ. శ. ఒక్కసారి పెద్ద జలప్రళయం వొచ్చేసింది. ప్రపంచమంతా మునిగిపోయింది. మొత్తం మానవజనాభా, పశువులూ, అన్ని జీవరాసులూ తుడిచిపెట్టుకుపోయాయి. అయితే ఏనాడో కెనడా వెళ్ళిన ఒక ఆంధ్రుడూ ఒక పంజాబీ, ఒక మహారాష్ట్రుడూ వాళ్ళ భార్యలూ మరణించకుండా మిగిలిపోయారు. ఒక చిన్న పడవలో వాళ్ళు బయలుదేరి ప్రయాణం సాగించారు. కతిపయదినాలకు వాళ్ళు భారత దేశం చేరుకున్నారు. భారతదేశం కూడా పూర్తిగా నీళ్ళల్లో తేలుతున్నది. వాళ్ళు కాస్సేపు బాధపడి, ఆంధ్రదేశంవైపు పడవలో సాగిపోయారు. కనుచూపుమేర అంతానీళ్ళే. వెళ్ళగా వెళ్ళగా ఒకచోటమాత్రం మునిగిపోకుండావున్న ఒక మేడ కన్పించింది. నెమ్మదిగా పడవదిగి కాస్సేపు ఈది మేడపైకి చేరారు. అక్కడ వాళ్ళకు కట్టలుకట్టిన అత్యంత సుందరమైన కొన్ని పుస్తకాలు కన్పించాయి. అవి తీసి చదవడం మొదలుపెట్టారు - వాళ్ళు ఆరుగురూ. అవి కొన్ని దశాబ్దాలకు పూర్వం కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించిన పత్రికలూ, కరపత్రాలూ. "ఎంత బంగారు కాలమది. ఆరోజుల్లో కరువూ కాటకం లేవన్నమాట. దేశం ఎంతో సుఖిఉంగా శాంతిభద్రతలతో వుండేదన్నమాట" అని ముచ్చటపడిపోయారు వాళ్ళు.

* * * *

మళ్ళీ సృష్టి ఆరంభమయింది.